"అమ్మా! అమ్మా!" అంటూ కమల ఇంట్లోకి పరిగెత్తింది.

"చాలా థాంక్స్ బావా!" అన్నాడు వెంకట్రావు.

"దానికేం లేవోయ్" అన్నాడు సుబ్బయ్య.

తనవంటి ఎందుకూ కొరగాని మనిషి అంతటి ఘనకార్యం చేయగల్గినందుకు అతనికి చెప్పలేనంత సంతోషం కలిగింది.

అతని కళ్ళు ఆనందబాష్పాలతో నిండేయి.

నడవలో ఇద్దరూ నిల్చొని ఉండగా లోన సావిత్రి కమలని అడుగుతోంది గట్టిగా.

"అడుగుతే ఇచ్చేడా? అడక్కుండా ఇచ్చేడా? చెప్పు!!"

కమల చెప్పిన జవాబు వినిపించలేదు.

"ఎందుకలా అడిగేవో చెప్పు!"

కమల ఏడుపు వినవచ్చింది.

సుబ్బయ్య లోనికి పరుగుతీసేడు.

అయిదువందల రూపాయలనోట్లు చేత్తో పట్టుకొని వెంకట్రావు నడవలో నిల్చున్నాడు.

ఆ సమయంలో అతను ఏమాలోచిస్తున్నాడో చెప్పడం కష్టం. (సశేషం)

# పుష్పవిలాసము ★

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

[అదొక్క పూఁదోఁట. పలురకాల పూలజాతులు నవయౌవనముతో మిసమిసలాడుతున్నై. ఒక్కొక్క తీఁగనే పరిశీలిస్తూపోయి నే నొకతిన్నెపై కూర్చున్నాను. అంతలో మలయమారుత కుమారుని చక్కిలిగింతలతో చెలరేగింది పుష్పాడి దుమారం. చివాలున లేచింది మల్లె.]

మల్లె

ఏమే గులాబీ! నిన్నకాక మొన్నవచ్చి నువ్వు తోడి వారినందర్నీ ఆక్షేపిస్తున్నావట? ఎందుకా మిడిసిపాటు?

తావుల్ చల్లుదువా సుదూరముగ?
పంతాలాట సైరింతువా?
తీవిన్ నిల్తువ తెప్పపాటయిన?
చూడ్కిన్ సైతువా గట్టిగా?
క్రేవన్ బాలసమీరణుండు నిలువన్
ప్రేమించి లాలింతువా?
పోవే; నెత్తురుకోతలే కదవె
నీ పుట్టింటి సౌభాగ్యముల్.

* * *

గులాబి

సరిలే. వారన్నమాటలు వినవు చూడు!

వలపులు గ్రుమ్మరించి
సుమభామల చిక్కని కౌగిలింతలం
దలరెదు తేఁటిరాజునకు
హాయిగ స్వాగతగీతి పాడునా?
చెలువము కర్కశంబు కద;
చెల్మిమెఱుంగమ పాపజాతితో;
తల విలువన్ గణింపవలదా
మఱి సంపగికన్నె; మల్లికా!

కేతకి

అది అల్లా ఉండనీగాని అక్కా! మల్లికా! ఈ మందారవల్లి నన్నేమని నిందించిందో విన్నావా?

నీకే చెల్లెనె కేతకీ! కనులలో
నిండార దుమ్మోయఁగా;
తాకన్ నెత్తురు చిందవ్రేళ్లు
కొఱుకన్; దర్పంబుగా నిల్వగా;
ఆ కంఠంబుగ పాపజాతికి
శరణ్యంబై మహారణ్యమం